

ఎందుకీ 'మీన'మేషాలు!

ఇటీవల కురిసిన భారీ వర్షాలతో జిల్లాలోని జలాశయాలు జలకళతో కళకళలాడుతున్నాయి.

8లో▸



పార్టీకి కార్యకర్తలే బలం

పార్టీకి కార్యకర్తలే బలం, బలగమని కర్నాటక రాష్ట్రం బల్లారి ఎమ్మెల్సీ సతీష్ అన్నారు.

8లో▸



మోక్షమెన్నడో!

సర్కారు భవనాల నిర్మాణాలపై అధికారులు, ప్రజాప్రతినిధులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారు.

9లో▸

న్యూస్‌రీల్

ప్రభుత్వ వైద్య కళాశాలలో ఔట్ సోర్సింగ్ పోస్టులు

నేటి నుంచి దరఖాస్తుల స్వీకరణ

వికారాబాద్ అర్బన్: జిల్లా పరిధిలోని అనంతగిరిలో ఏర్పాటు చేస్తున్న ప్రభుత్వ వైద్య కళాశాలలో ఔట్ సోర్సింగ్ ప్రాతిపదికన నియామకాలు చేపడుతున్నట్లు ఆఫీస్ సూపరింటెండెంట్ రాజేశ్‌బాబు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. వివిధ విభాగాల్లో 32 పోస్టులను భర్తీ చేసేందుకు దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు చెప్పారు. అర్హులైన వారు ఈనెల 22 నుంచి 27 సాయంత్రం 5 గంటల వరకు అనంతగిరిలోని ప్రభుత్వ వైద్య కళాశాల అడ్మినిస్ట్రేషన్ విభాగంలో దరఖాస్తులు అందజేయాలన్నారు. మెరిట్ ప్రాతిపదికన అభ్యర్థుల ఎంపిక ఉంటుందన్నారు. వివరాలకు 7893855655ని సంప్రదించాలన్నారు.

మోడల్ స్కూల్‌లో బోధనకు దరఖాస్తుల ఆహ్వానం

పరిగి: మండల పరిధిలోని జాపర్‌పల్లిలోని మోడల్ స్కూల్‌లో వివిధ సబ్జెక్టుల్లో బోధించేందుకు అర్హులైన వారి నుంచి దరఖాస్తులు స్వీకరిస్తున్నట్టు పాఠశాల ప్రిన్సిపాల్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. పాఠశాలలో ఇంగ్లిష్, గణితం, జంతుశాస్త్రం, వాణిజ్యశాస్త్రం అర్థశాస్త్రం, భౌతికశాస్త్రాలను బోధించేందుకు అర్హులైన వారు బుధవారం సాయంత్రం 5గంటల లోపు దరఖాస్తులు చేసుకోవాలని సూచించారు. వీరు గంటల ప్రాతిపాదికన పనిచేయాల్సి ఉంటుందని అందుకు నెలకు రూ.18,200 వేతనం చెల్లిస్తామన్నారు. డెమో ఆధారంగా ఉపాధ్యాయుల ఎంపిక ఉంటుందన్నారు. వివరాలకు 9000278284 నంబర్‌లో సంప్రందించాలన్నారు.

ఐటీఐ కోర్సుల ప్రవేశాలకు..

వికారాబాద్ అర్బన్: జిల్లాలోని ఐటీఐలలో మూడో విడత ప్రవేశాల కోసం దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ప్రభుత్వ ఐటీఐ కళాశాల ప్రిన్సిపల్ నరేంద్రబాబు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లాలోని ప్రభుత్వ, ప్రైవేటు ఐటీఐ కోర్సుల్లో 2023–24 విద్యాసం వత్సరానికిగాను అర్హత కలిగిన అభ్యర్థులందరూ దరఖాస్తు చేసుకోవాలన్నారు. ఈ అవకాశాన్ని ఆసక్తిగల 10వ, 8వ తరగతి ఉత్తీర్ణులైన విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. అవసరమైన ఒరిజినల్ సర్టిఫికెట్లను స్కాన్ చేసి వెబ్‌సైట్‌లో అప్లోడ్ చేయాలన్నారు. వివరాలకు 9177472488, 855865421 నంబర్లను సంప్రదించాలన్నారు.

'ప్రజావాణి' ఫిర్యాదులను సత్వరమే పరిష్కరించండి

అదనపు కలెక్టర్ లింగ్యానాయక్



ఫిర్యాదులు స్వీకరిస్తున్న లింగ్యానాయక్

వికారాబాద్ అర్బన్: ప్రజావాణిలో వచ్చిన ఫిర్యాదులను సత్వరమే పరిష్కరించేందుకు సంబంధిత అధికారులు చర్యలు చేపట్టాలని అదనపు కలెక్టర్ లింగ్యానాయక్ అన్నారు. సోమవారం కలెక్టర్ కార్యాలయంలోని కాన్ఫరెన్స్ హాలులో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో జిల్లా పరిధిలోని నుంచి 116 దరఖాస్తులు అందాయి. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ ఫిర్యాదులను ఆయా శాఖల అధికారులకు అందజేశారు. అనంతరం లింగ్యానాయక్ మాట్లాడుతూ.. ప్రజలు నమ్మకంతో ఎంతో దూరం నుంచి వచ్చి ఫిర్యాదులు చేస్తారని వారి నమ్మకాన్ని వమ్ము చేయకుండా సమస్య పరిష్కారానికి కృషి చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఇండస్ట్రీస్ జీఎం వినయ్‌కుమార్, తహసీల్దార్ కిరణ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

విద్యారంగంపై చిన్నచూపు తగదు

ఎస్‌ఎఫ్‌ఐ రాష్ట్ర కార్యదర్శి నాగరాజు

ఇబ్రహీంపట్నం రూరల్: విద్యారంగంపై ప్రభుత్వానికి చిన్నచూపు తగదని ఎస్‌ఎఫ్‌ఐ రాష్ట్ర కార్యదర్శి టి.నాగరాజు అన్నారు. విద్యారంగ సమస్యలు పరిష్కరించాలని కోరుతూ సోమవారం జిల్లా కమిటీ ఆధ్వర్యంలో కలెక్టరేట్ ఎదుట మహాధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రభుత్వం విద్యావ్యవస్థను పూర్తిగా గాలికొదిలేసిందని విమర్శించారు. మధ్యాహ్న భోజనానికి నిధులు మంజూరు చేయకపోవడంతో నాణ్యమైన భోజనం అందడం లేదని మండిపడ్డారు. రీయింబర్స్‌మెంట్ బకాయిలు, స్కాలర్‌షిప్‌లు విడుదల చేయాలని డిమాండ్ చేశారు. పోరాటాల ఫలితంగా సాధించుకున్న డిగ్రీ కళాశాలకు నేటికీ సొంత భవనాలు కరువయ్యాయని తెలిపారు. విద్యారంగ సమస్యలపై రాజీలేని పోరాటం చేస్తామని స్పష్టం చేశారు. అనంతరం అడిషనల్ కలెక్టర్ భూపాల్‌రెడ్డికి వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో సంఘం రంగారెడ్డి జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు ప్రణయ్, బి.శంకర్, ఉపాధ్యక్షులు చరణ్, శివ, తదితరులు పాల్గొన్నారు.



కొప్పుల హరీశ్వర్‌రెడ్డికి స్వీట్లు తినిపిస్తున్న మహేశ్‌రెడ్డి అభిమానులు



రోహిత్‌రెడ్డికి మిఠాయి తినిపిస్తున్న ఎమ్మెల్సీ పట్నం మహేందర్‌రెడ్డి

పైలెట్ టేకాఫ్

తాండూరు: తొలుత 2009లో ప్రజారాజ్యం పార్టీలో చేరి రాజకీయ అడుగులు ప్రారంభించిన రోహిత్‌రెడ్డి ఆ తర్వాత మన పార్టీ తరపున తాండూరు అసెంబ్లీ బరిలో నిలిచి ఓటమిపాలయ్యారు. అనంతరం టీఆర్‌ఎస్ గూటికి చేరి తెలంగాణ రాష్ట్ర ఉద్యమంలో కీలకంగా పని చేశారు. అప్పట్లో జరిగిన పంచాయతీ ఎన్నికల్లో తన స్వగ్రామమైన ఇందర్‌చెడ్‌లో టీఆర్‌ఎస్ అభ్యర్థిని గెలిపించుకుని పార్టీకి తొలి విజయం కట్టబెట్టారు. తాండూరులో తన కేడర్‌ను బలోపేతం చేసుకునే క్రమంలో మంత్రిగా ఉన్న మహేందర్‌రెడ్డితో విభేదాలు నెలకొన్నాయి. దీంతో పార్టీ బహిష్కరణకు గురయ్యారు. ఆ తర్వాత ఒంటరిగానే కార్యక్రమాలను చేపడుతూ.. 2018లో అనూహ్యంగా కాంగ్రెస్ టికెట్‌తో పాటు మహేందర్‌రెడ్డిపై విజయం సాధించారు.

సబిత ఆశీర్వాదం

తాండూరు ఎమ్మెల్యే రోహిత్‌రెడ్డి సోమవారం సాయంత్రం మంత్రి సబితారెడ్డిని కలిసి ఆశీస్సులు పొందారు. తన విజయానికి సహకరించాలని కోరారు. దీనిపై స్పందించిన మంత్రి రెండోసారి ఎమ్మెల్యేగా తిరుగులేని విజయం సాధిస్తావని దీవించారు.




ప్రగతిభవన్ వద్ద రోహిత్‌రెడ్డిని ఎత్తుకున్న అభిమానులు

గులాబీ రేసు గుర్రాలు

బీఆర్‌ఎస్ తరఫున పాత వారికే మరో అవకాశం

- మొదటి జాబితాలోనే నలుగురు ఎమ్మెల్యే అభ్యర్థుల ప్రకటన
- ఉత్కంఠ రేపిన తాండూరు స్థానం



టికెట్ ఖరారుతో ఎమ్మెల్యే ఆనంద్‌కు అభినందనలు తెలుపుతున్న నాయకులు



వికారాబాద్: బీఆర్‌ఎస్ అధిష్ఠానం సిట్టింగులకే మళ్లీ చాన్స్ ఇచ్చింది. ప్రయోగాలకు తావులేకుండా నాలుగు నియోజకవర్గాల్లోనూ పాతవారికే అవకాశం కల్పిస్తూ పార్టీ అధినేత కేసీఆర్ అభ్యర్థులను ప్రకటించారు. జిల్లా పరిధిలో రెండేళ్లుగా హడావుడి చేసినా.. అసమ్మతి నేతలకు చోటు దక్కలేదు. ఒక్క మాటలో చెప్పాలంటే టికెట్ల కేటాయింపు విషయంలో బీఆర్‌ఎస్ ఎలాంటి రిస్క్ చేయలేదు. పార్టీ జిల్లా అధ్యక్షుడు, ఎమ్మెల్యే మెతుకు ఆనంద్‌కు వికారాబాద్ నుంచి మరోమారు అవకాశం కల్పించింది. పరిగి నుంచి ఎమ్మెల్యే కొప్పుల మహేశ్‌రెడ్డి, తాండూరు నుంచి పైలట్ రోహిత్‌రెడ్డి, కొడంగల్ నుంచి పట్నం నరేందర్‌రెడ్డి, చేవెళ్ల నుంచి జిల్లాకు చెందిన కాలె యాదయ్యకు సీట్లు దక్కాయి. కాగా టికెట్లు ఖరారుకు ముందుగానే అసమ్మతి నేతలను కలుపుకొని వెళ్లాలని ఎమ్మెల్యేలకు హితబోధ చేసినట్లు సమాచారం. జాబితా ప్రకటించే సమయంలో పట్నం, పైలట్, ఇద్దరూ ప్రగతి భవన్‌కు చేరుకోవడంతో ఒకింత ఉత్కంఠ నెలకొన్నా.. అందరూ ఊహించిన విధంగానే పార్టీ టికెట్ రోహిత్‌రెడ్డినే వరించింది.

'మీతో నేను'తో ప్రజలతో మమేకం..

ఎమ్మెల్యేగా ఆనంద్ గెలిచింది మొదలు నిత్యం ప్రజాక్షేత్రంలోనే ఉన్నారు. బీఆర్‌ఎస్ జిల్లా అధ్యక్షుడిగా పార్టీ బాధ్యతలు చేపట్టారు.మీతో నేను కార్యక్రమంలో భాగంగా విస్తృతంగా గ్రామాల్లో పర్యటిస్తున్నారు.గత ఎన్నికల్లో ఆయన గెలుపునకు శ్రమించిన నేతల్లో ఎక్కువ శాతం మంది నాయకులు ప్రస్తుతం వ్యతిరేకంగా మారారు.వీరిని కలుపుకొని వెళ్లడం ఆనంద్‌కు కత్తిమీద సాములా మారనుంది. జిల్లా కేంద్రంలో మెడికల్ కళాశాల,ఆయుష్ ఆస్పత్రి, రైల్వే ఫ్లై ఓవర్‌కు భారీగా నిధుల కేటాయింపు, మున్సిపాలిటీకి నిధుల కేటాయింపు తదితర అంశాల్లో ఎమ్మెల్యేగా సక్సెస్ అయ్యారు. రెండు నెలల క్రితం మర్పల్లిలో నిర్వహించిన ఆత్మీయ సమ్మేళనానికి 20వేలకు పైగా కార్యకర్తలను తరలించి మంత్రి హరీశ్‌రావ్‌తో పాటు అధిష్ఠానం దృష్టిని ఆకర్షించారు.

ప్రజలే నరేంద్రుడి బలం

కొడంగల్: బీఆర్‌ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థిగా ప్రస్తుత ఎమ్మెల్యే పట్నం నరేందర్‌రెడ్డికి రెండోసారి అవకాశం దక్కింది. ముఖ్యమంత్రి కేసీఆర్ సోమవారం విడుదల చేసిన ఎమ్మెల్యే అభ్యర్థుల జాబితాలో నరేందర్‌రెడ్డి చోటు దక్కించుకున్నారు. నిత్యం కొడంగల్‌లో పర్యటిస్తూ కార్యకర్తలు, ప్రజలకు నిత్యం అందుబాటులో ఉండటం ఆయన ప్రత్యేక బలం. ఈ క్రమంలో ప్రతి గ్రామం నుంచి కింది స్థాయి వరకు ప్రత్యక్ష పరిచయాలు ఏర్పడ్డాయి. ఇన్నాళ్లు బీఆర్‌ఎస్‌లో ఉంటూ 2018లో పట్నం నరేందర్‌రెడ్డి గెలుపునకు సహకరించిన మాజీ ఎమ్మెల్యే గురునాథ్‌రెడ్డి కుటుంబం దూరం కావడం నరేందర్‌రెడ్డి కొంత మైనస్‌గా చెప్పవచ్చు. చివరి ఎన్నికల్లో రేవంత్‌రెడ్డిపై విజయం సాధించడంతో రెట్టింపు ఆత్మవిశ్వాసాన్ని సంతరించుకున్నారు.

నలభై ఏళ్ల 'కొప్పుల' ప్రస్థానం

పరిగి: పరిగి నియోజకవర్గంలో కొప్పుల కుటుంబ రాజకీయ ప్రస్థానం 40 ఏళ్లుగా కొనసాగుతోంది. 1989 నుంచి 2014 వరకు కొప్పుల హరీశ్వర్‌రెడ్డి ఎమ్మెల్యేగా కొనసాగారు. ఆతర్వాత జరిగిన 2014 ఎన్నికల్లో ఓటమి పాలయ్యారు. ఐదు సార్లు ఎమ్మెల్యేగా గెలిచిన కొప్పుల ప్రత్యేక రాష్ట్రం ఏర్పడిన తర్వాత అనూహ్య తీరులో ఓడిపోయారు. అనంతరం వయసు పైనపడటం, ఆరోగ్యం సహకరించని కారణంగా పెద్ద కుమారుడు కొప్పుల మహేశ్‌రెడ్డి రంగంలోకి దిగారు. 2018లో బీఆర్‌ఎస్ తరఫున పోటీచేసి 16వేల ఓట్ల మెజార్టీతో విజయఢంకా మోగించారు. ఆతర్వాత నిత్యం ప్రజల్లో ఉంటూ తండ్రి వారసత్వాన్ని కొనసాగిస్తున్నారు.

అభివృద్ధే విజయానికి సోపానాలు



ముఖ్యమంత్రి కేసీఆర్ చేపడుతున్న అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలే బీఆర్‌ఎస్ పార్టీ అభ్యర్థుల విజయానికి సోపానాలవుతాయి. జిల్లాలో సిట్టింగ్ ఎమ్మెల్యేలందరికీ టికెట్లు కేటాయించిన ముఖ్యమంత్రి కేసీఆర్‌కు ధన్యవాదాలు. నియోజకవర్గంలో చేసిన అభివృద్ధే మళ్లీ గెలిపిస్తుంది.

– పట్లోళ్ల సబితారెడ్డి, మహేశ్వరం

అన్ని స్థానాల్లో విజయం మాదే



బీఆర్‌ఎస్ జాబితాలో జిల్లాలోని సిట్టింగ్ ఎమ్మెల్యేలందరికీ అవకాశం దక్కడం సంతోషంగా ఉంది. పార్టీ అధినేత, సీఎం కేసీఆర్ మాపై ఉంచిన నమ్మకాన్ని నిలబెట్టుకుంటాం. పార్టీ వర్కింగ్ కమిటీ అధ్యక్షుడు కేటీఆర్, విద్యాశాఖ మంత్రి సబితారెడ్డి, చేవెళ్ల ఎంపీ రంజిత్‌రెడ్డి ప్రత్యేక ధన్యవాదములు. జిల్లాలోని అన్ని నియోజకవర్గాల్లో గులాబీ జెండాలు ఎగరేస్తాం. ప్రభుత్వ సంక్షేమ పథకాలే మమ్మల్ని గెలిపిస్తాయి.

– డాక్టర్ మెతుకు ఆనంద్, ఎమ్మెల్యే, వికారాబాద్ , బీఆర్‌ఎస్ జిల్లా అధ్యక్షుడు

వైన్స్‌కు కొత్త ఓనర్స్

- 59 మద్యం దుకాణాలకు డ్రా పద్ధతిలో యజమానుల ఎంపిక
- ప్రభుత్వ ఖజానాకు రూ.52.74కోట్ల ఆదాయం
- రెంటల్ ద్వారా మరో రూ.65కోట్లు
- పాత దుకాణాలకు డిసెంబర్ వరకు అవకాశం



మద్యం దుకాణాలకు డ్రా తీస్తున్న కలెక్టర్ నారాయణరెడ్డి

వికారాబాద్: మద్యం దుకాణాలకు కొత్త ఓనర్లు వచ్చారు. నవంబర్ నెలాఖరుతో ప్రస్తుత మద్యం దుకాణాల టెండర్ల గడువు ముగియనుంది. కొంటర్ల స్వీకరణకు కొత్త యజమానులు డిసెంబర్ 1 వరకు ఆగాల్సిందే. జిల్లా పరిధిలో మునుపెన్నడూ లేని విధంగా 59 దుకాణాలకు గాను 2,637 దరఖాస్తులు రావటంతో ప్రభుత్వ ఖజానాకు మద్యం ఆదాయం కిక్కు పెంచింది. సోమవారం వికారాబాద్ కలెక్టర్ కార్యాలయంలోని ఆడిటోరియం హాల్‌లో దుకాణాల కేటాయింపునకు కలెక్టర్ నారాయణరెడ్డి, ఎస్పీ కోటిరెడ్డి, ఎక్సైజ్ సూపరిటెండెంట్ నవీన్‌చంద్ర సమక్షంలో డ్రా తీసి నూతన యజమానులను ఎంపిక చేశారు. 59 మంది నూతన యజమానులకు కలెక్టర్ మద్యం దుకాణాల లైసెన్స్‌లు అప్పగించారు.

రిజర్వ్‌డ్ స్థానాల్లో బినామీలు..?

జిల్లాలో మొత్తం 59 మద్యం దుకాణాలుండగా గతేడాది మాదిరిగానే మద్యం దుకాణాల కేటాయింపు విషయంలో రిజర్వేషన్లు అమలు చేశారు. రిజర్వ్‌డ్ షాపులకు బినామీలను పెట్టుకుని ఇతరులు దరఖాస్తులు వేసినట్టు ప్రచారం జరుగుతోంది. ఈ ఏడాది టెండర్లలో మహిళలు కూడా అధికంగానే పాల్గొన్నారు. దరఖాస్తుల రూపంలో ప్రభుత్వానికి రూ. 52.74కోట్ల ఆదాయం సమకూరింది. రెంటల్ ద్వారా ప్రభుత్వానికి మరో రూ. 65 కోట్ల ఆదాయం వస్తుందని అధికారుల అంచనాలు చెబుతున్నాయి.

ఆందోళనలో సిండికేట్లు

కొందరు ముందుగానే సిండికేట్‌గా మారి దుకాణాలకు దరఖాస్తు చేయగా.. మరికొందరు గడువు ముగిశాక సిండికేట్‌గా మారారు. డ్రాలో అదృష్టం ఎవరిని వరించినా వాటాలు పంచుకునేందుకు ఒప్పందం కుదుర్చుకున్నట్లు చర్చించుకుంటున్నారు. కాగా 90శాతం మందికి సిండికేట్‌గా మారి దరఖాస్తు చేయగా షాపులు సైతం సిండికేట్లనే వరించాయి. ఒక్కో సిండికేట్‌లో 10 మంది నుంచి 999మంది దరఖాస్తులు చేశారు. పలవురు ప్రభుత్వ ఉద్యోగులు వారి సతీమణులతో కలిసి వచ్చి అదృష్టాన్ని పరీక్షించుకున్నారు. 200లకు పైగా దరఖాస్తులు చేసిన వారికి సైతం ఐదు నుంచి ఆరు షాపులే దక్కడంతో నష్టపాలవవుతామేమోనని ఒకింత అందోళన చెందుతున్నారు.

'పట్నం'కు పట్టాభిషేకం

- రేపు అత్యవసర మంత్రివర్గ సమావేశం
- మంత్రివర్గ మార్పుల నేపథ్యంలో మహేందర్‌రెడ్డికి హోం లేదా ఇరిగేషన్ శాఖ కేటాయిస్తారంటూ ప్రచారం



సీఎం కేసీఆర్‌ను కలిసిన పట్నం మహేందర్‌రెడ్డి, ఎంపీ రంజిత్‌రెడ్డి, ఎమ్మెల్యే రోహిత్‌రెడ్డి

తాండూరు: ఉమ్మడి జిల్లా ఎమ్మెల్సీ, మాజీ మంత్రి పట్నం మహేందర్‌రెడ్డికి మంత్రివర్గ విస్తరణలో చోటు కల్పించేందుకు సీఎం కేసీఆర్ నిర్ణయించినట్లు సమాచారం. అసెంబ్లీ ఎన్నికలకు మరో మూడు నెలలు మాత్రమే గడువున్న సమయంలో కేబినెట్ విస్తరణ చేపట్టడంపై రాజకీయ వర్గాల్లో చర్చలు జోరందుకున్నాయి. ఉమ్మడి రంగారెడ్డి జిల్లాను శాసించిన పట్నం మహేందర్‌రెడ్డికి బలమైన కేడర్ ఉంది. కాగా తాండూరు ఎమ్మెల్యే రోహిత్‌రెడ్డి కాంగ్రెస్ నుంచి బీఆర్‌ఎస్‌లో చేరిన సమయంలో సీఎం కేసీఆర్ మళ్లీ అసెంబ్లీ టికెట్ ఇస్తానంటూ హామీతో పాటుగా గతేడాది ఎమ్మెల్యేల ఎర కేసులో ఆయన కీలకంగా వ్యవహరించి బీఆర్‌ఎస్‌ను జాతీయ స్థాయిలో చర్చించుకునేందుకు కారణమయ్యారనే సదాభిప్రాయం ఉంది. దీంతో పక్షం రోజులుగా టికెట్ కేటాయింపు విషయంలో పట్నం మహేందర్‌రెడ్డిని బుజ్జగించారు. ఈ నెల 23న అత్యవసర మంత్రి వర్గ సమావేశం అనంతరం కేబినెట్ విస్తరణ ఉంటుందని పార్టీ వర్గాలు చర్చించుకుంటున్నాయి. ఈ విస్తరణలో పట్నం మహేందర్‌రెడ్డికి హోం, లేదా ఇరిగేషన్ శాఖ మంత్రిగా బాధ్యతలు కట్టబెడతారనే ప్రచారం సాగుతోంది.

సోమవారం ఉదయం ఎంపీ రంజిత్‌రెడ్డితో పాటు ఎమ్మెల్సీ పట్నం మహేందర్‌రెడ్డి, ఎమ్మెల్యే రోహిత్‌రెడ్డి సీఎం కేసీఆర్‌ను కలిసి పుష్పగుచ్ఛం అందించారు. ఈ ఎన్నికల వరకు మంత్రిగా.. ఎన్నికల అనంతరం నూతన కేబినెట్‌లోనూ బెర్త్ కనఫర్మ్ చేసినట్లు సమాచారం.

అన్నా.. ఆశీర్వదించండి

తాండూరు ఎమ్మెల్యే రోహిత్‌రెడ్డి సోమవారం సాయంత్రం పట్నం మహేందర్‌రెడ్డి నివాసానికి వెళ్లి ఆశీర్వాదం తీసుకున్నారు. ఇంటికి వచ్చిన రోహిత్‌రెడ్డిని ఎమ్మెల్సీ సాదరంగా ఆహ్వానించి స్వీట్లు తినిపించి శుభాకాంక్షలు తెలిపారు. మరో రెండు రోజుల్లో మంత్రి పదవి చేపట్టనున్న మహేందర్‌రెడ్డికి ఎమ్మెల్యే రోహిత్‌రెడ్డి ముందస్తు అభినందనలు తెలిపారు. తాండూరులో తన గెలుపునకు సహకరించాలని కోరారు. అనంతరం విద్యాశాఖ మంత్రి సబితాఇంద్రారెడ్డిని కలిసి ఆశీస్సులు తీసుకున్నారు.

ప్రభుత్వాలు మారినా తలరాతలు మారట్లే

- ఎస్సీ వర్గీకరణతోనే అభివృద్ధి సాధ్యం
- ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మంద కృష్ణ మాదిగ



మాట్లాడుతున్న మందకృష్ణ మాదిగ

కొడంగల్: ఎస్సీ వర్గీకరణతోనే అణగారిన వర్గాల అభివృద్ధి సాధ్యమని ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మంద కృష్ణ మాదిగ అన్నారు. సోమవారం పట్టణంలో ఎమ్మార్పీఎస్ సీనియర్ నాయకుడు సోమశేఖర్ ఆధ్వర్యంలో నియోజకవర్గ సన్నాహక సదస్సు నిర్వహించారు. ఈ సదస్సుకు ముఖ్య అతిథిగా హాజరైన మందకృష్ణ మాట్లాడుతూ.. సెప్టెంబర్‌లో నిర్వహించ తలపెట్టిన మాదిగల విశ్వరూప మహాసభను విజయవంతం చేయాలని కోరారు. ప్రభుత్వాలు ఎన్ని మారినా మాదిగల తలరాత మారడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. 1999లో ఎస్సీ వర్గీకరణ బిల్లును అప్పటి ప్రభుత్వం పార్లమెంట్‌లో పెట్టి ఆమోదం తెలిపిందన్నారు. అయితే కొంతమంది మాదిగల వ్యతిరేకులు 2004లో సుప్రీం కోర్టులో కేసు వేసినట్లు చెప్పారు. 1999 నుంచి 2004 వరకు వర్గీకరణ బిల్లు అమల్లో ఉండడంతో మాదిగలకు ఐదేళ్లలో 20వేల ఉద్యోగాలు వచ్చాయని అన్నారు. వర్గీకరణ అమలులో లేని 50ఏళ్లలో కేవలం 22 వేల ఉద్యోగాలు మాత్రమే మాదిగలకు వచ్చాయయన్నారు. రాజకీయ పార్టీల నేతలు తమను ఓటు బ్యాంకుగా చూస్తున్నాయే తప్ప భవిష్యత్ గురించి ఆలోచించడం లేదని విమర్శించారు. ప్రస్తుతం శాసన సభ, లోక్‌సభ ఎన్నికలు సమీపిస్తున్న నేపథ్యంలో రాజకీయ పార్టీలకు తగిన బుద్ధిం చెప్పేందుకు సెప్టెంబర్‌లో హైదరాబాద్‌లో పెద్ద ఎత్తున మాదిగల విశ్వరూప మహాసభను నిర్వహిస్తున్నట్లు చెప్పారు. జిల్లా నలుమూలల నుంచి మాదిగలు అధిక సంఖ్యలో హాజరవ్వాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ నాయకులు కోళ్ల శివ, ఆనంద్ కేరెళ్లి, మల్లిఖార్జున్, మల్కప్ప తదితరులు పాల్గొన్నారు.

ఆధ్యాత్మిక చింతన అలవర్చుకోవాలి

- డీసీసీ అధ్యక్షుడు రామ్మోహన్‌రెడ్డి



వీరాంజనేయ స్వామిని దర్శించుకున్న డీసీసీ అధ్యక్షుడు రామ్మోహన్‌రెడ్డి

దోమ: ఆధ్యాత్మిక చింతనతో మానసిక ప్రశాంతత చేకూరుతుందని డీసీసీ అధ్యక్షుడు రామ్మోహన్‌రెడ్డి అన్నారు. సోమవారం ఆయన మండల పరిధిలోని లింగన్‌పల్లి అనుబంధ గ్రామం ఎల్లారెడ్డిపల్లిలో మాలి రాంచంద్రారెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించిన బొడ్రాయి ప్రతిష్ఠాపన, వీరాంజనేయ స్వామి విగ్రహ ప్రతిష్ఠాపన, ధ్వజస్తంభ ప్రతిష్ఠాపన ఉత్సవాలకు హాజరయ్యారు. ఈ సందర్భంగా టీఆర్‌ఆర్ ఆలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం గుండాలలో ఎల్లమ్మ, మైసమ్మ దేవతల ఆలయ నిర్మాణాలకు భూమి పూజ చేశారు. ఈ సదర్భంగా టీఆర్‌ఆర్ మాట్లాడుతూ.. ప్రజలు భక్తిభావం పెంపొందించుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్‌లు బల్లరాణి, సుజాత, గుండాల ఎంపీటీసీ సభ్యుడు బసప్ప, ఆలయ చైర్మన్ రామన్న మాదిగ, వైస్ చైర్మన్ బాలయ్య, కాంగ్రెస్ జిల్లా ఉపాధ్యక్షుడు రాములు నాయక్, మైలారం ఎంపీటీసీ మాజీ సభ్యుడు గోవర్ధన్, కాంగ్రెస్ సీనియర్ నాయకులు పటోళ్ల ప్రభాకర్‌రెడ్డి, రాచపాల్‌రెడ్డి, మాలి శివకుమార్ రెడ్డి పాల్గొన్నారు.

శ్మశానవాటిక స్థలానికి మంత్రి హామీ



మంత్రితో ఎమ్మెల్యే, నాయకులు

బొంరాస్‌పేట: కోస్గి పట్టణంలో 5 ఎకరాల భూమిని ఖబ్రస్తాన్‌కు కేటాయించాలని స్థానిక మైనార్టీ నాయకులు హోం మంత్రి మహమూద్ అలీని కోరగా.. ఆయన సానుకూలంగా స్పందించారు. సోమవారం సచివాలయంలో హోం మంత్రిని, కోస్గి వక్ఫ్‌బోర్డు చైర్మన్ మసిఉల్లాహ్‌ఖాన్ ఎమ్మెల్యే పట్నం నరేందర్‌రెడ్డి సమక్షంలో కలిసి శ్మశాన వాటికకు స్థలం కేటాయించాలని విన్నవించారు. ఇందులో బీఆర్‌ఎస్ మండల మైనార్టీ అధ్యక్షుడు ఎఫ్ఎస్ సలాం, ముస్లిం డెవలప్‌మెంట్ కమిటీ ప్రధాన కార్యదర్శి వాహబ్, మహ్మద్ ముస్తాఫా, సాజిద్‌లున్నారు.

'మోర్ సూపర్' మార్కెట్లో చోరీ

రూ.2 లక్షల నగదు అపహరణ

తాండూరు టౌన్: తాండూరు పట్టణం వినాయక్‌చౌక్‌లోని మోర్ సూపర్ మార్కెట్లో ఆదివారం రాత్రి చోరీ జరిగింది. పట్టణ సీఐ రాజేందర్ రెడ్డి తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. స్థానిక మోర్ మార్కెట్‌లో ఆదివారం అర్ధరాత్రి దాటిన తర్వాత సుమారు 2 గంటల సమయంలో ముగ్గురు దొంగలు షట్టర్‌ను ఇనుప రాడ్లతో పైకి లేపి లోపలికి చొరబడ్డారు. శని, ఆదివారాల్లో మార్కెట్లో వచ్చిన రూ.2.05లక్షల నగదును నిర్వాహకులు అక్కడే ఉన్న లాకర్‌లో పెట్టి వెళ్లిపోయారు. లోపలికి చొరబడిన దొంగలు.. లాకర్‌ను ఎత్తుకెళ్లారు. ఉదయం షాపు తెరిచేందుకు వచ్చిన నిర్వాహకుడు చోరీ జరిగిన విషయాన్ని గ్రహించి పోలీసులకు సమాచారం ఇచ్చారు. అక్కడే ఉన్న సీసీ పుటేజీలను పరిశీలించగా ముగ్గురు వ్యక్తులు దొంగతనానికి పాల్పడినట్లు గుర్తించారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

ఎందుకీ 'మీన'మేషాలు!

- జలమున్నా జలచరాల పంపిణీలో ఆలస్యం
- ఈ ఏడాది 1.29కోట్ల చేప పిల్లల పంపిణీ లక్ష్యం
- 830 చెరువులు, కుంటలు, రిజర్వాయర్ల ఎంపిక
- మత్స్యకారుల నిరీక్షణ
- అదునుదాటితే ఎదగవని ఆవేదన

పరిగి: ఇటీవల కురిసిన భారీ వర్షాలతో జిల్లాలోని జలాశయాలు జలకళతో కళకళలాడుతున్నాయి. ప్రాజెక్టులు, చెరువులు, కుంటలు నిండుకుండలను తలపిస్తున్నాయి. కానీ జలాశయాల్లో మత్యకారులకు సిరులు కురిపించే చేప పిల్లలను మాత్రం ప్రభుత్వం పంపిణీ చేయడం లేదు. ఈ పాటికి చేప పిల్లలను వదిలితే వేసవి నాటికి.. మత్స్యకారుల చేతికి దిగుబడి వచ్చి లాభాలు అర్జించే అవకాశం ఉండేది. గతంలో సెప్టెంబర్, అక్టోబర్‌లో చేపపిల్లను వదలడంతో ఎదుగుదల లోపించి, ఆశించినంత లాభం రాలేదనే అభిప్రాయం లేకపోలేదు. ఈ ఏడాది జులైలోనే వర్షాలు కురిసి జలాశయాలు నిండుగా ఉన్నాయని, ఆలస్యం చేయకుండా ప్రభుత్వం చేప పిల్లను సరఫరా చేయాలని మత్స్యకారులు కోరుతున్నారు.

846 చెరువులకు పంపిణీ

మత్స్యకారులకు ఉపాధి కల్పించేందుకు ప్రభుత్వం జిల్లా వ్యాప్తంగా నీటి వసతి కలిగిన చెరువుల్లో ఉచితంగా చేప పిల్లలను వదిలేందుకు జులై మాసంలోనే ప్రణాళికను సిద్ధం చేసుకుంది. చేప పిల్లల సరఫరాకు టెండర్లను పూర్తి చేసినా.. పంపిణీపై ఇంకా స్పష్టత రాలేదు. జిల్లాలో 830 చెరువులు, కుంటలు, 16 ప్రాజెక్టులు ఉన్నాయి.

133 మత్స్యకార సంఘాలు

జిల్లాలో 133 మత్స్యకార సంఘాలు ఉన్నాయి. వీరికి ఉపాధి కల్పించేందుకు ప్రభుత్వం రహూ, బొచ్చ, బంగారు తీగ వంటి చేప పిల్లల పంపిణీకి శ్రీకారం చుట్టింది. 35 ఎంఎం నుంచి 45ఎంఎం 1.04 కోట్లు, 80ఎంఎం నుంచి 100ఎంఎం చేప పిల్లలు 25లక్షలు మొత్తం 1.29 కోట్ల చేప పిల్లలను వదలాలని మత్స్యశాఖ లక్ష్యంగా పెట్టుకుంది. ఇతర రాష్ట్రాల నుంచి చేప పిల్లలను దిగుమతి చేసుకొని పంపిణీ చేయాలని నిర్ణయించినప్పటికీ.. ఇంకా తేదీలను ఖరారు చేయలేదు.



గతేడాది ప్రభుత్వం పంపిణీ చేసిన చేపపిల్లలు



నాసిరకం పిల్లలు

గతంలో చేప పిల్లల పంపిణీలో పలు అక్రమాలు జరిగినట్లు ఆరోపణలు ఉన్నాయి. సకాలంలో సరఫరా చేయకపోవడంతో ఎదుగుదల లేక మత్స్యకారులకు నష్టం వాటిల్లింది. నాణ్యతా పరిమాణం లేని చేప పిల్లలను వదిలి చేతులు దులుపుకొన్నారన్న విమర్శలు వచ్చాయి. ప్రభుత్వం ఉచితంగా పంపిణీ చేస్తున్న చేప పిల్లల కోసం వచ్చిన మత్స్యకారుల నుంచి అధికారులు వేలాది రూపాయల వసూళ్లకు పాల్పడ్డారన్న ఆరోపణలు లేకపోలేదు. పైసలు గుంజినప్పటికీ నాసిరకం, తక్కువ చేప పిల్లలను ఇవ్వడంతో బెస్తలు గతేడాది పూర్తిగా నష్టపోయినట్లు తెలుస్తోంది. వీటన్నింటిని దృష్టిలో ఉంచుకొని మత్స్యశాఖ అధికారులు ఈ ఏడాది తగిన జాగ్రత్తలు తీసుకుని తగిన పరిమాణం, నాణ్యతా ప్రమాణాలు పాటించేలా చర్యలు తీసుకోవాలని మత్స్యకారులు కోరుతున్నారు.

త్వరలో పంపిణీ చేస్తాం

జిల్లా వ్యాప్తంగా 846 చెరువులు, కుంటల్లో చేప పిల్లలను వదిలేందుకు ప్రణాళికలు సిద్ధం చేశాం. జిల్లాలో 1.29 కోట్ల చేప పిల్లలను వదిలేందుకు లక్ష్యంగా ఇప్పటికే టెండర్లను పూర్తి చేశాం. అన్ని చెరువులు, కుంటల్లో నాణ్యమైన చేప పిల్లలను వదులుతాం. ప్రభుత్వం నుంచి పంపిణీకి సంబంధించి తేదీలు ఇంకా ప్రకటించలేదు. త్వరలోనే పంపిణీ చేస్తాం.

– చరిత, మత్స్యశాఖ జిల్లా అధికారి

టికెట్ల సంబురం

- ఎమ్మెల్యే మద్దతుదారుల్లో జోష్
- గెలిచి తీరుతామని నినాదాలు



బీఆర్‌ఎస్ అధినేత కేసీఆర్ ప్రకటించిన అసెంబ్లీ అభ్యర్థుల జాబితాలో సిట్టింగులకే సీట్లు దక్కడంతో వారి మద్దతుదారులు సంబురాలు చేసుకున్నారు. తమ నాయకుడిని మరో సారి గెలిపించి తీరుతామని నినాదాలు చేశారు. ప్రస్తుతం ఉన్నవారికే మరో అవకాశం ఇవ్వడంతో రెబెల్స్ ఆశలపై నీళ్లు చల్లినట్లయింది. నిన్నమొన్నటి వరకు టికెట్ తమకేనంటూ ప్రచారం చేసిన అసమ్మతి నేతలు బాస్ నిర్ణయంతో సైలెంట్‌యిపోయారు. పార్టీ ఆదేశాలను పాటించే వారికి భవిష్యత్తులో అనేక అవకాశాలు వస్తాయని చెప్పడంతో ఏం చేయాలో తోచక డైలమాలో పడ్డారు.

– వికారాబాద్, తాండూరు, పరిగి, కొడంగల్

వికారాబాద్ అభ్యర్థిగా ఆనంద్



పేరు: డాక్టర్ మెతుకు ఆనంద్, ఎమ్మెల్యే, వికారాబాద్
వయస్సు : 48 సంవత్సరాలు
విద్యార్హత : ఎంబీబీఎస్, ఎండీ, సర్జన్
తల్లిదండ్రులు : పోచమ్మ, సాయన్న
భార్య : డాక్టర్ సబిత
సంతానం : వినూత్న, వైభవ్
స్వగ్రామం : కేరెళ్లి, ధారూరు మండలం
పదవులు : 2018 డిసెంబర్ నుంచి ఎమ్మెల్యేగా కొనసాగుతున్నారు.

తాండూర్ నుంచి రోహిత్‌రెడ్డి



పేరు: పంజుగుల రోహిత్‌రెడ్డి
వయస్సు : 39 సంవత్సరాలు
విద్యార్హత: ఏరోనాటికల్ ఇంజినీరింగ్
తల్లిదండ్రులు: ప్రమోదినిదేవి, విఠల్‌రెడ్డి
భార్య: ఆర్తిరెడ్డి
సంతానం: నక్షత్ర, జయదేవ్‌రెడ్డి
స్వగ్రామం: ఇందర్‌చెడ్ గ్రామం, బషీరాబాద్ మండలం
పదవులు: 2018 నుంచి ఎమ్మెల్యేగా కొనసాగుతున్నారు.

కొడంగల్‌లో నరేందర్‌రెడ్డి



పేరు : పట్నం నరేందర్‌రెడ్డి
తండ్రి : పట్నం మల్లారెడ్డి
తల్లి : రుక్కమ్మ
భార్య : శృతిరెడ్డి
కుమారుడు : హితేష్‌రెడ్డి
కూతుర్లు : దీక్ష, ఉపేక్ష (కవలలు), చదువు : బీఎస్సీ (అగ్రికల్చర్)
ప్రభావం : స్వర్గీయ ఇంద్రారెడ్డి (మేనమామ) ఎన్‌టీ రామారావ్, పట్నం మహేందర్‌రెడ్డి (అన్న)
పదవులు : 1994 నుంచి 2006 (పీఏసీఎస్ చైర్మన్ తాళ్లపల్లి)
2006 నుంచి 2008 (ఎంపీపీ షాబాద్)
2010 నుంచి 2018: ఎమ్మెల్సీ
2018 నుంచి కొడంగల్ ఎమ్మెల్యే

పరిగి కొప్పులకే



పేరు. కొప్పుల మహేశ్‌రెడ్డి
వయస్సు:50 సంవత్సరాలు
విద్యార్హత : ఇంటర్
తల్లిదండ్రులు: కొప్పుల హరీశ్వర్‌రెడ్డి, గిరిజాదేవి
భార్య : ప్రతిమారెడ్డి
పిల్లలు : వర్షిత్‌రెడ్డి, వినీషారెడ్డి
స్వగ్రామం : పరిగి
పదవి : 2018 నుంచి ఎమ్మెల్యేగా కొనసాగుతున్నారు
గతంలో: రైతు సమన్వయ సమితి జిల్లా కోఆర్డినేటర్ పనిచేశారు.

అగ్గువకు అనారోగ్యం కొని తెచ్చుకోవద్దు



పోలీసులు స్వాధీనం చేసుకున్న నకిలీ అల్లం వెల్లుల్లి పేస్ట్ డబ్బాలు

- డీఎస్పీ కరుణాసాగర్ రెడ్డి
- కుల్కచర్లలో భారీగా నకిలీ అల్లం వెల్లుల్లిపేస్ట్ స్వాధీనం
- ఇద్దరిపై కేసు



వివరాలను వెల్లడిస్తున్న డీఎస్పీ కరుణాసాగర్ చిత్రంలో ఎస్ఐ శ్రీశైలం

కుల్కచర్ల: తక్కువ ధరలకు లభించే ఆహారపదార్థాలు కొనుగోలుచేసి అనారోగ్యాలను కొని తెచ్చుకోవద్దని పరిగి డీఎస్పీ కరుణాసాగర్‌రెడ్డి అన్నారు. నకిలీ అల్లం వెల్లుల్లి పేస్టు అమ్మకాలు చేపడుతున్న ముఠా గుట్టు రట్టవడంతో ఆయన సోమవారం విలేకరుల సమావేశం నిర్వహించి వివరాలు వెల్లడించారు. ఈ నెల 20న కుల్కచర్లకు చెందిన పూసల రాము నకిలీ అల్లంవెల్లుల్లి పేస్ట్ అమ్ముతున్నట్లు విశ్వసనీయ సమాచారం అందింది. ఈ మేరకు రామును అదుపులోకి తీసుకుని విచారించగా.. నగరంలోని కుషాయిగూడ చక్రీధర్ కాలనీకి చెందిన కొత్తపల్లి భానుప్రసాద్ దగ్గర కొనుగోలు వారాంతపు సంతలో అమ్ముతున్నట్లు చెప్పాడు. పోలీసులు చేపట్టిన తనిఖీల్లో ఆయన వద్ద 470 కిలోల అల్లంవెల్లుల్లి పేస్టుతో పాటుగా 40కేజీల వెల్లుల్లి బ్యాగు, కిలోన్నర సిట్రిక్ యాసిడ్, రెండు కిలోల నిమ్మ ఉప్పు, 100 ఎంఎల్‌ల ఎసిటిక్ యాసిడ్ స్వాధీనం చేసుకున్నారు. వీటిని ప్రభుత్వ గుర్తింపు కానీ, హాల్‌మార్క్‌గాని లేదని చెప్పారు. ఈ మేరకు రాము, భానుప్రసాద్‌లపై కేసు నమోదు చేశామన్నారు. స్వాధీనం చేసుకున్న అల్లం పేస్టును పరీక్షల నిమిత్తం ఫుడ్‌సేఫ్టీ విభాగానికి పంపిస్తామన్నారు. ప్రజల ఆరోగ్యానికి హాని కలిగించే నకిలీ వస్తువులను విక్రయిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో కుల్కచర్ల ఎస్ఐ శ్రీశైలం ఉన్నారు.

సమస్యలను శాంతియుతంగా పరిష్కరించుకోవాలి: డీఎస్పీ శేఖర్‌గౌడ్

తాండూరు: ముస్లిం వెల్ఫేర్ అసోషియేషన్‌లో తలెత్తిన చిన్నపాటి సమస్యను జటిలంగా మార్చకుండా శాంతియుతంగా పరిష్కరించుకోవాలని తాండూరు డీఎస్పీ శేఖర్‌గౌడ్ సూచించారు. సోమవారం ఆయన తాండూరు సబ్ డివిజన్ కార్యాలయ ప్రాంగణంలో ముస్లిం వెల్ఫేర్ అసోషియేషన్ తాండూరులో ఇరు వర్గాలకు చెందిన ప్రతినిధులతో సమావేశమయ్యారు. అసోషియేషన్ సభ్యులు రెండు కమిటీలుగా చీలిపోయి ఆరు నెలలుగా తరచూ గొడవలు పడుతున్నారు. ఇటీవల పరస్పరం ఫిర్యాదులు చేసుకున్నారు. పాత కమిటీ ప్రతినిధులు నిధులు లెక్క తేల్చలేదని ఆరోపించారు. ఈ విషయంలో డీఎస్పీ ఎదుట ముస్లిం ప్రతినిధుల మధ్య స్వల్ప వాగ్వాదం జరిగింది. డీఎస్పీ కల్పించుకుని గొడవలతో సమస్య పరిష్కారం కాదని హెచ్చరించారు. ఇరు వర్గాల నుంచి ముగ్గురు వస్తే సమస్య పరిష్కారం చేస్తానని నచ్చజెప్పారు. దీంతో ముస్లిం వెల్ఫేర్ అసోషియేషన్ ప్రతినిధులు ఇందుకు అంగీకరించారు. ఈ కార్యక్రమంలో కమల్ అతార్, ఎం ఏ.హాదీషహేరి, ఖుర్షీద్, షకీల్, అబ్దుల్ ఖవి, సత్తార్, పాష తదితరులున్నారు.

కొడంగల్‌లో ఆర్పీఎఫ్ దళాల కవాతు



కవాతు చేస్తున్న ఆర్‌పీఎఫ్ బలగాలు

కొడంగల్: శాసనసభ ఎన్నికల నేపథ్యంలో మున్సిపల్ పరిధి సమస్యాత్మక ప్రాంతాల్లో ఆర్పీఎఫ్ బలగాలు సోమవారం కవాతు నిర్వహించాయి. 99 బెటాలియన్ హకీంపేటకు చెందిన అసిస్టెంట్ కమాండెంట్ రాహుల్ రామా రావ్, ఇన్‌స్పెక్టర్లు సూరజ్, ప్రకాశ్‌సాహు, లలితా గోప నారాయణ్‌ల ఆధ్వర్యంలో 65 మంది ర్యాపిడ్ యాక్షన్ ఫోర్సు జవాన్లు పుర వీధుల గుండా తిరిగారు. సమస్యాత్మక ప్రాంత ప్రజల్లో భరోసా నింపడం కోసం కవాతు నిర్వహిస్తున్నట్లు పరిగి డీఎస్పీ కరుణాసాగర్‌రెడ్డి పేర్కొన్నారు. అంబేడ్కర్ చౌరస్తా నుంచి మెయిన్ రోడ్డు మీదుగా వినాయక చౌరస్తా, సంత బజార్, బ్రాహ్మనవాడ, తెలుగుగేరి, బాలాజీనగర్ నుంచి పట్టణ వీధుల గుండా పోలీస్‌స్టేషన్‌కు చేరుకున్నారు. కొడంగల్ సీఐ రాములు, ఎస్ఐ గోపాల్ పాల్గొన్నారు.

గులాబీ శ్రేణుల ఉత్సవాలు



తాండూరు: పొట్లి మహరాజ్ దేవాలయ ప్రాంగణంలో..



కొడంగల్: బాణసంచా కాలుస్తున్న బీఆర్‌ఎస్ కార్యకర్తలు

- సిట్టింగ్ ఎమ్మెల్యేలకే టికెట్ల ఖరారు
- బాణసంచాలు కాల్చి, మిఠాయిలు పంచిపెట్టిన బీఆర్‌ఎస్ నేతలు

కొడంగల్: ఎమ్మెల్యే పట్నం నరేందర్‌రెడ్డికి రెండోసారి బీఆర్‌ఎస్ టికెట్ దక్కడంతో కొడంగల్ అంబేడ్కర్ చౌరస్తాలో పార్టీ నాయకులు, కార్యకర్తలు సంబురాలు జరుపుకొన్నారు. మున్సిపల్ రెండోవార్డు కౌన్సిలర్ మధుసూదన్‌రావ్ ఆధ్వర్యంలో బాణసంచాలు కాల్చారు. స్వీట్లు పంచి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడారు. నరేందర్‌రెడ్డి గెలుపు కోసం ప్రతి ఒక్కరూ కృషి చేయాలన్నారు. కొడంగల్ నుంచి పీఎన్‌ఆర్‌ను గెలిపించి కేసీఆర్‌ను మూడోసారి ముఖ్యమంత్రిని చేయాలన్నారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ రమేష్‌బాబు, గోవిందు, ఉడిమేశ్వరం మధు, నవాజ్, ఆర్.రాహుల్ తదితరులు పాల్గొన్నారు.

రోహిత్‌రెడ్డి గెలుపే లక్ష్యంగా..

పెద్దేముల్: రాబోయే ఎన్నికల్లో తాండూరు ఎమ్మెల్యే రోహిత్‌రెడ్డి గెలుపే లక్ష్యంగా ప్రతి కార్యకర్త పనిచేయాలని బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు కోహీర్ శ్రీనివాస్ పిలుపునిచ్చారు. ముఖ్యమంత్రి కేసీఆర్ రెండోసారి రోహిత్‌రెడ్డికి అవకాశం ఇవ్వడంతో మంబాపూర్, మారేపల్లితండా, హన్మాపూర్, పెద్దేముల్ తదితర ప్రాంతాల్లో పార్టీ శ్రేణులు బాణసంచాలు కాలుస్తూ మిఠాయిలు పంచిపెట్టారు. కార్యక్రమంలో పార్టీ సర్పంచ్, ఎంపీటీసీ సభ్యులు, నాయకులు జితేందర్‌రెడ్డి, రమేష్‌కుమార్, శ్రావణ్‌కుమార్, నారాయణరెడ్డి, రవి నాయక్, జనార్దన్‌రెడ్డి ఉన్నారు.



పెద్దేముల్‌లో..

ఎమ్మెల్యే నివాసంలో..

అనంతగిరి: వికారాబాద్ ఎమ్మెల్యే డాక్టర్ మెతుకు ఆనంద్‌కు ముఖ్యమంత్రి కేసీఆర్ మరోసారి అవకాశం ఇవ్వడంతో పార్టీ శ్రేణులు, అభిమానులు ఎమ్మెల్యే నివాసం వద్ద సంబురాలు జరుపుకొన్నారు. ఎమ్మెల్యేను కలిసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా బాణసంచాలు కాల్చారు.

కుల్కచర్లలో..

కుల్కచర్ల: బీఆర్‌ఎస్ పరిగి ఎమ్మెల్యే అభ్యర్థిగా కొప్పుల మహేశ్ రెడ్డికి సీఎం కేసీఆర్ మరోసారి అవకాశం ఇవ్వడంతో మండల కేంద్రంలో ఆ పార్టీ శ్రేణులు సంబురాలు జరుపుకొన్నారు.

భారీ మెజార్టీ ఖాయం

యాలాల: బీఆర్‌ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థిగా రోహిత్‌రెడ్డి మరోసారి భారీ మెజార్టీతో గెలవడం ఖాయమని ఆ పార్టీ మండల అధ్యక్షుడు రవీందర్‌రెడ్డి అన్నారు. ఎమ్మెల్యే అభ్యర్థిగా రోహిత్‌రెడ్డిని సీఎం కేసీఆర్ ప్రకటించడంతో మండల కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో ఎంపీపీ బాలేశ్వర్‌గుప్తా, కోఆప్షన్ సభ్యుల సంఘం జిల్లా అధ్యక్షుడు అక్బర్‌బాబాతో కలిసి సంబురాలు జరుపుకొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ఎమ్మెల్యే రోహిత్‌రెడ్డికి టికెట్ కేటాయించే విషయంలో ఎమ్మెల్సీ మహేందర్‌రెడ్డి సహకరించినందుకు కృతజ్ఞతలు తెలిపారు. ఏఎంసీ మాజీ డైరెక్టర్ ఆశన్న, వైస్ ఎంపీపీ రమేష్, లాలప్ప, అశోక్, నర్సింహులు తదితరులు ఉన్నారు.



యాలాల: ఎంపీపీకి మిఠాయి తినిపిస్తున్న కోఆప్షన్ సభ్యుడు అక్బర్‌బాబ

పార్టీకి కార్యకర్తలే బలం.. బలగం

- తాండూరులో బీజేపీ గెలవడం ఖాయం
- బల్లారి ఎమ్మెల్సీ సతీష్



అనంతగిరి: మాట్లాడుతున్న సోలాపూర్ ఎమ్మెల్యే



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ సతీష్

యాలాల: పార్టీకి కార్యకర్తలే బలం, బలగమని కర్నాటక రాష్ట్రం బల్లారి ఎమ్మెల్సీ సతీష్ అన్నారు. సోమవారం బీజేపీ మండల అధ్యక్షుడు కుర్వ మహిపాల్ అధ్యక్షతన నిర్వహించిన కార్యకర్తల సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. రానున్న అసెంబ్లీ ఎన్నికల్లో మార్పును నియోజకవర్గ ప్రజలు కోరుకుంటున్నారని చెప్పారు. గత కర్నాటక ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ మోసపూరిత హామీలిచ్చిందని, ప్రస్తుతం అక్కడి ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని పేర్కొన్నారు. అనంతరం పార్టీ ప్రధాన కార్యదర్శి రమేష్‌కుమార్, రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు మురళీకృష్ణ గౌడ్, నరేష్ మహరాజ్ మాట్లాడారు. తాండూరులో అధికార పార్టీ నాయకుల్లో సీటు కోసం పోటీ నెలకొందని, కాంగ్రెస్, బీఆర్‌ఎస్ పార్టీలు ప్రజావ్యతిరేక విధానాలను అవలంభిస్తున్నాయని విమర్శించారు. రాష్ట్రంలో అమలవుతున్న సంక్షేమ పథకాల్లో చాలా వరకు కేంద్ర ప్రభుత్వ నిధులతో చేపడుతున్నవేనని పేర్కొన్నారు. కార్యక్రమంలో పార్టీ ఉపాధ్యక్షుడు హన్మంతు, జిల్లా కార్యదర్శి రామ్యానాయక్, మండల ప్రధాన కార్యదర్శి వెంకటేశ్, మండల ఉపాధ్యక్షుడు లక్ష్మీకాంత్‌రెడ్డి, సంపత్ గౌడ్, జంగం యాదగిరి తదితరులు ఉన్నారు.

అధికారంలోకి వచ్చేది బీజేపీ ప్రభుత్వమే

అనంతగిరి: వచ్చే ఎన్నికల్లో రాష్ట్రంలో బీజేపీ ప్రభుత్వం అధికారంలోకి వస్తోందని కర్ణాటక రాష్ట్రం సోలాపూర్ ఎమ్మెల్యే విజయ్ కుమార్ దేశ్‌ముఖ్ అన్నారు. వికారాబాద్ పర్యటనకు వచ్చిన ఆయన సోమవారం పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు రాఘవనాయక్ నివాసంలో పార్టీ ముఖ్య నాయకుల సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మండలంలో పార్టీ బలాబలాలను కార్యకర్తలతో చర్చించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. రాష్ట్రంలోని అన్ని నియోజకవర్గాల్లో పార్టీ ఒక్క నియోజకవర్గానికి ఒక ఎమ్మెల్యేని ఇన్‌చార్జిగా నియమించిందని చెప్పారు. బూత్ స్థాయి నుంచి పార్టీని బలోపేతం చేయాలని ఆయన సూచించారు. ఈ కార్యక్రమంలో పార్టీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు శివరాజ్, జిల్లా ప్రధాన కార్యదర్శి పాండుగౌడ్, ఎస్సీ సెల్ జిల్లా అధ్యక్షుడు నవీన్‌కుమార్, పార్టీ మండల అధ్యక్షుడు గోపాల్ రెడ్డి, నాయకులు శంకర్, బసవలింగం, అమరేందర్ రెడ్డి , భాస్కర్ రెడ్డి, చరణ్‌రెడ్డి, రాజేందరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

జిల్లాలో ఉపాధ్యాయ అక్రమ బదిలీలు

పీఆర్‌టీయూ జిల్లా అధ్యక్షుడు గోవర్ధన్ యాదవ్

శంకర్‌పల్లి: రంగారెడ్డి జిల్లాలోకి వచ్చే అక్రమ ఉపాధ్యాయ బదిలీలను ఆపాలని పీఆర్‌టీయూ ఉపాధ్యాయ సంఘం జిల్లా అధ్యక్షుడు గోవర్ధన్ యాదవ్ డిమాండ్ చేశారు. పీఆర్‌టీయూ ఉపాధ్యాయ సంఘం సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని సోమవారం మండలంలోని పర్వేద, మహారాజ్‌పేట్, టంగుటూరు, ప్రొద్దుటూరు, జనవాడ, కొత్తపల్లి శంకర్‌పల్లి పాఠశాలల్లో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఇతర జిల్లాల నుంచి రంగారెడ్డి జిల్లాకు ఉపాధ్యాయులు అక్రమంగా బదిలీపై వస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. పీఆర్సీని వెంటనే చేయాలని, మధ్యంతర భృతిని ప్రకటించాలని కోరారు. ఈ కార్యక్రమంలో పీఆర్‌టీయూ మండల శాఖ అధ్యక్షుడు రాజశేఖర్, గౌరవ అధ్యక్షుడు బాల్‌రాజ్, రాష్ట్ర బాధ్యులు రవి కాంత్‌రెడ్డి, శ్రీధర్, మాణిక్యం, మల్లేశం, మొయినాబాద్ మండల అధ్యక్షుడు బందయ్య పాల్గొన్నారు.